క్లుప్తంగా

టీకాలు చిన్నారులకు రక్షణ కవచాలు



మహానంది గిరిజన గూడెంలో చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

మహానంది: అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఏడాదిన్నర వయసున్న చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యంపీహెచ్‌ఈఓ హుసేన్ రెడ్డి అన్నారు. మహానంది సమీపంలో ఉన్న చెంచు గూడెంలో బుధవారం ఆరోగ్య కార్యకర్త హేమలత బాలింతలకు, చిన్న పిల్లలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో మహిళాపోలీస్ శారద, ఆశ కార్యకర్త వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన

మహానంది: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఉజ్వల యోజన తదితర పథకాలపై ప్రజలకు అవగాహన ఉండాలని బండిఆత్మకూరు ఎంపీడీఓ వాసుదేవ గుప్త తెలిపారు. బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరు, బి. కోడూరు గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఏ.కోడూరు గ్రామ సర్పంచ్ జ్ఞానాభరణం, బి కోడూరు గ్రామ సర్పంచ్ వెంకట జయలక్ష్మి, డాక్టర్ రంజిత తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మహానంది: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న పోలింగ్ స్టేషన్లను తహసీల్దార్ జనార్దన్ శెట్టి, ఎస్ఐ నాగేంద్రప్రసాద్ బుధవారం పరిశీలించారు. గ్రామాల్లోని పాఠశాలల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి పోలింగ్ స్టేషన్ నెంబరుకు విధిగా గోడపై రాయడంతో పాటు విద్యుత్, మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. ఏఎస్ఐ రామకృష్ణుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

కొత్తపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం అమలు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకుడు నక్క. సంపత్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌సుబ్రహ్మణ్యంకి ఫీల్డ్‌అసిస్టెంట్ల సమస్యలపై వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. పనిదినాల టార్గెట్ విధానం రద్దుచేసి, అందరికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు సుధాకర్, దేవదాసు, రత్నాకర్, స్వాములు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీపై శిక్షణ

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృత్తివిద్య శిక్షణా కార్యక్రమంలో భాగంగా డేటా ఎంట్రీ ఆపరేటర్ల శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ వెంకటనరసయ్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో వృత్తి విద్యా నైపుణ్యంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కనీసం 10వ తరగతి పాస్ అయి 18 నుంచి 30 సంవత్సరాల నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు ఈనెల 20 లోపు డిగ్రీకళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు సెల్ 9885912685 కు సంప్రదించాలని కోరారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నందికొట్కూరు: ప్రభుత్వం ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా రఘురామమూర్తి అన్నారు. బుధవారం పట్టణంలోని కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై పటేల్ సెంటర్‌లో ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలంటూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికుడు అనారోగ్యంతో మృతి చెందితే రూ. 5 లక్షలు, ప్రమాదంలో చనిపోతే రూ.10 లక్షలు బీమా పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు శివ, శివరేష్, షేక్షావలి, మా బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిషు భాషపై పట్టు సాధించాలి

మహానంది: వ్యవసాయ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించాలని మహానంది ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ నాయక్ సూచించారు. కళాశాలలో బుధవారం ఆంగ్లంలో అవసరమైన నాలుగు నైపుణ్యాలు అనే అంశంపై విద్యార్థులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జాతీయ వ్యవసాయ ఉన్నత విద్యాపథకం, సంస్థాగత అభివృద్ధిలో భాగంగా హైదరాబాద్ నగరానికి చెందిన సాత్విక్ ఐటీ సొల్యూషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఐడీపీ మెంబరు డాక్టర్ ఎంఎస్ రాహుల్, ట్రైనర్ మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం...గెలుద్దాం

- ఆడుదాం..ఆంధ్ర ఆటల పోటీలకు చురుగ్గా ఏర్పాట్లు
- ముగిసిన క్రీడాకారుల రిజిస్ట్రేషన్లు
- ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు పోటీలు
- 14,136 మంది క్రీడాకారుల నమోదు



కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు (ఫైల్)

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాలకు వరకు ఆటలను ప్రోత్సహిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా కారులు రాణించేలా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్ర క్రీడలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

వాడవాడలా క్రీడా పండుగ..

రూ.కోట్లు వచ్చించి 51 రోజుల పాటు వాడవాడలా ఆటల పండుగను నిర్వంచేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఆడుదాం..ఆంధ్ర క్రీడల్లో అన్ని గ్రామాల్లో షెటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, కబడ్డీ తదితర క్రీడలను స్త్రీ, పురుషుల విభాగాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు. ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు ఈ పోటీలు నిర్వహిస్తారు. సచివాలయ, మండల, నియోజకవర్గస్థాయి, జిల్లా స్థాయిలో పోటీలు జరుగనున్నాయి.

సచివాలయస్థాయి నుంచి..

నియోజకవర్గంలోని 84 సచివాలయాలు, 6 మండలాలు, ఒక మున్సిపాలిటీ, నియోజకవర్గ స్థాయిలో ఈ పోటీలు ఉంటాయి. ముందుగా సచివాలయ స్థాయిలో స్త్రీ, పురుషుల విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయి. అనంతరం ఆయా క్రీడాంశాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులతో గ్రామ స్థాయి జట్టును సిద్ధం చేస్తారు. ఈ జట్లు మండల స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. మండల స్థాయిలో విజేత జట్లు నియోజకవర్గ స్థాయిలో, నియోజకవర్గం స్థాయిలో విజేత జట్లు జిల్లా స్థాయి పోటీల్లో తలపడతారు. జిల్లా స్థాయి విజేత జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడే అవకాశం కల్పిస్తారు.

15 నుంచి సచివాలయ స్థాయిలో..

నందికొట్కూరు నియోజకవర్గ వ్యాప్తంగా 19,152 మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. ఇందులో భాగంగా రిజిస్ట్రేషన్ చివరి రోజు వరకు పురుషులు 9,576 మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు.మహిళలు 4,560 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి జనవరి 1వ తేదీ వరకు సచివాలయం స్థాయిలో పోటీలు జరుగుతాయి. జనవరి 2వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మండల స్థాయిలో ఎంపీడీఓలు, తహసీల్దార్లు ఆధ్వర్యంలో క్రీడలు జరుగనున్నాయి. 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో పోటీలు జరుగుతాయి.

క్రీడా పరికరాల పంపిణీ

ఆడుదాం ఆంధ్ర క్రీడలకు అవసరమైన క్రీడా పరికరాలను ఇప్పటికే ఆయా సచివాలయలకు చేరవేశారు. అలాగే క్రీడా మైదానాలను సైతం సిద్ధం చేశారు.

ఆహ్లాదకర వాతావరణంలో క్రీడలు



సచివాలయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఆహ్లాదకర వాతావరణంలో ఆడుదాం -ఆంధ్ర పోటీలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు శాఖల అధికారులకు ప్రభుత్వం బాధ్యత అప్పగించింది. పోటీలకు అవసరమైన క్రీడా సామగ్రిని ప్రభుత్వం ఇప్పటికే అందజేసింది. జిల్లా అధికారుల సహకారంతో క్రీడలను ఉత్సాహభరితంగా నిర్వహించారు. – స్వామిదాసు రవికుమార్ శాప్,నంద్యాల జిల్లా కో ఆర్డినేటర్

పారదర్శకంగా పోటీలు



క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసింది. నియోజకవర్గంలో 14,136 మంది క్రీడాకారులు వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేన్లు చేసుకున్నారు. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశాలతో పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు చకాచకా కొనసాగుతున్నాయి. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పోటీలను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తాం.

– పెరుమాళ్ల శ్రీనాథ్, శాప్ కర్నూలు జిల్లా కోఆర్డినేటర్

భ్రామరికి ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్:శ్రీశైల శ్రీభ్రమరాంబాదేవికి బుధవారం మూలనక్షత్రం సందర్భంగా ఊయలసేవను అర్చకులు వేదపండితులు శాస్త్రోక్తపూజలు నిర్వహించారు. సాయంత్రం 7గంటల తరువాత ప్రారంభమైన ఊయల సేవలో భాగంగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్ల మూర్తులను వేంచేయింపజేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం,త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామపూజలు శాస్త్రోక్తంగా చేశారు. భక్తులకు కూడా ఈసేవలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు.

ఈ- క్రాప్ బుకింగ్ తప్పనిసరి

కొత్తపల్లి: రబీ సీజన్‌లో పంటలు సాగుచేసుకున్న ప్రతి రైతు ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏఓ కె.మహేష్ సూచించారు. బుధవారం మండలంలోని గోకవరం గ్రామ శివారుల్లోని పంట పొలాల్లో జరుగుతున్న పంట నమోదు ప్రక్రియను తనిఖీ చేశారు. అదేవిధంగా ఆర్‌బీకేను సందర్శించి పంట నమోదు, పీఎం కిసాన్, ఈకేవైసీలపై సిబ్బంది, రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీఈఓ ఇమ్రాన్, రైతులు ఉన్నారు.

ఓటర్ల వివరాలు ఆన్‌లైన్ చేయాలి

పాములపాడు: ఓటర్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ రత్నరాధిక అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో భూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఫారం-6,7,8 లను ఆన్‌లైన్‌లో ఫార్వర్డ్ చేయడం, పీఎస్ఈ, డీఎస్ఈ ఓటర్ల వివరాలు, 10ప్లస్, జంక్ ఓటర్ల విచారణ గురించి వివరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ పఠాన్ బాబు, బీఎల్వోలు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన



ప్రవచనాలను బోధిస్తున్న విద్యా గణపతి పీఠాధిపతి శ్రవణ్‌కుమార్ శర్మ

పగిడ్యాల: బిల్వాన్ని ముట్టుకున్నా మోక్ష ఫలం లభిస్తోందని శాస్త్రాలు ఘోషిస్తున్నాయని తెలంగాణ రాష్ట్రం పాలమూరు విద్యా గణపతి పీఠాధిపతి ఇరువంటి శ్రవణ్‌కుమార్ శర్మ అన్నారు. కార్తీక మాసం ముగిసి మాఘమాసంలోకి అడుగిడుతున్నా సందర్భంగా పడమర ప్రాతకోట గ్రామంలోని గౌరీ మోక్షేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం లక్ష బిల్వార్చన వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రవణ్ కుమార్ శర్మ బిల్వం యొక్క విశిష్టతను భక్తులకు ప్రవచించారు.

శ్రీశైలక్షేత్రంలో అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న చైర్మన్, ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆయా పనులకు సంబంధించి పలు ప్రదేశాలను ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారిచక్రపాణిరెడ్డి, ఈఓ డి పెద్దిరాజు పరిశీలించారు. ఇందులో భాగంగా రోడ్లు భవనాల అతిథిగృహ కూడలి, సిద్ధరామప్ప కొలను ప్రాంతం , మల్లికార్జున సదన్ కూడలి తదితర వాటిని సందర్శించారు. వారు మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు రోడ్లు భవనాల శాఖ అతిథిగృహం వద్ద రహదారిని ఇరువైపులా విస్తరణ చేపడుతున్నట్లు తెలిపారు. రాజుల సత్రం కూడలి నుంచి సిద్ధరామప్ప పాదాల వరకు బ్రిడ్జి నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

గొర్రెల పెంపకందారుల ప్రాథమిక సహకార సంఘం ఎన్నిక



క్రిష్టయ్య, కమిటీ సభ్యులకు డిక్లరేషన్ అందజేస్తున్న డాక్టర్ అనిల్

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా గొర్రెల పెంపకందారుల ప్రాథమిక సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవమయ్యింది. బుధవారం గ్రామంలోని సుంకులమ్మ ఆలయం వద్ద పాములపాడు పశువుల వైద్యాధికారి డాక్టర్ అనిల్ ఎన్నికల అధికారిగా ఎన్నికలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా నూతన కమిటీ అధ్యక్షుడిగా కల్వరాళ్ల క్రిష్టయ్యయాదవ్, ఉపాధ్యక్షుడిగా వెంకటశివుడు, కార్యవర్గ సభ్యులుగా వెంకటపతి, లక్ష్మయ్య, కృష్ణుడు, నాగపుల్లయ్య, గోవిందులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జూపాడుబంగ్లా పశువుల ఆసుపత్రి ఎల్ఎస్ఏ నవీన్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

పట్టణాభివృద్ధే లక్ష్యం

ఆత్మకూరు: పట్టణాభివృద్ధే లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. పట్టణంలోని 22, 23 వార్డుల పరిధిలో బుధవారం నూతన సీసీ రోడ్లుకు భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ వార్డుల్లో రూ.5 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బందెల మాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన కార్యక్రమాలు


ఆత్మకూరు: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పట్టణంలోని తహసీల్దార్ కార్యలయం వద్ద చేపట్టిన దీక్షలు బుధవారం రెండో రోజుకు చేరుకున్నాయి. యూనియన్ నాయకురాళ్లు మంజుల, లక్ష్మీదేవి, ప్రమీలమ్మ, సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు రజాక్, రామ్‌నాయక్ పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలోని స్టోర్ సెంటర్ వద్ద అంగన్‌వాడీలుధర్నా కార్యక్రమం చేపట్టారు ఏఐటీయుసీ నాయకులు నాగిరెడ్డి, ఓబులయ్య ,అన్వర్, ఐఎఫ్‌టీయూ నాయకులు ఆశీర్వాదం తదితరులు అంగన్‌వాడీలకు మద్దతు ప్రకటించారు.

జూపాడుబంగ్లా: సమస్యల పరిష్కారం కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు బుధవారం భోజనవిరామం సమయంలో సహపంక్తి భోజనాలు చేశారు.

జూపాడుబంగ్లా: అంగన్‌వాడీ వర్కర్లు సమ్మెలో ఉండటంతో కేంద్రాలకు మంజూరైన కందిబేడలు వెనక్కి తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని 38 అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన కందిబేడల సంచులను ఆటోలో వేసుకొని సూపర్‌వైజర్ నిర్మలమ్మ కేంద్రాల వద్దకు వెళ్లింది. సమ్మె కారణంగా అంగన్‌వాడీ కేంద్రాలకు తాళం వేసి ఉండటంతో వెనక్కి తీసుకెళ్లాల్సి వచ్చింది.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మల్యాలలో పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, అధికారులు

నందికొట్కూరు రూరల్ : మండలంలో శనగ పంటను సాగు చేసిన రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ షేక్షావలి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో వ్యవసాయశాఖ అధికారులు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులకు శనగ పంటలో పురుగు, తెగుళ్ల నివారణకు సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వీఏఏ శాంతిరాజు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదును పూర్తి చేయాలి

గ్రామీణ ప్రాంతాలలోని రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పంటల నమోదును త్వరగా పూర్తి చేయాలని ఏఓ షేక్షావలి సూచించారు. బుధవారం మండలంలోని బొల్లవరం, దామగట్ల గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్‌కు సంబంధించి రైతులతో ఈ-కేవైసీ పూర్తి చేయాలని, ఫర్టిలైజర్‌కు చెందిన బకాయి బిల్లులను త్వరితగతిన చెల్లించాలని సూచించారు.

ప్రతి పల్లె ప్రగతి పథంలో

- గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో అభివృద్ధి పనులు
- సీసీ రోడ్డు, తాగునీటి పథకం ప్రారంభోత్సవాలు
- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

పాములపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పల్లెను ప్రగతి పథంలో నడిపిస్తోందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. బుధవారం మండలంలోని జూటూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, ఎంపీపీ నిధులతో తాగునీటి సమస్య కోసం ఏర్పాటు చేసిన బోరును ప్రారంభించారు. అలాగే ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామం, ప్రతి వీధి, ప్రతి ఇంటిని సందర్శించామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టికి వచ్చిన వాటిని పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి రూ.20లక్షలు నిధులు కేటాయించిందని, ఆ నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియ, సర్పంచులు నాయిని సావిత్రమ్మ, రామస్వామి, మాణిక్యమ్మ, డీఈ ధనిబాబు, తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ గోపీకృష్ణ, వైస్ ఎంపీపీ బండ్లమూరి వెంకటేశ్వర్లు, ఉప సర్పంచు సలాం, కో ఆప్టెడ్ ముర్తుజావలి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తను ఎమ్మెల్యే పరామర్శ

నందికొట్కూరు: ఈ నెల 6న ఎద్దు పొడవడంతో కాలు విరిగిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సంగెం రత్నస్వామిని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ బుధవారం పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు. త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

బాలకార్మికులతో పనిచేయించుకోవద్దు



మాట్లాడుతున్న లేబర్ అధికారి సారామార్గరేట్

ఆత్మకూరు: పట్టణంలో బైక్‌మెకానికల్, కిరాణ దుకాణాల్లో బాలకార్మికులను పనుల్లో చేర్చుకోవద్దని, ఆత్మకూరు సహాయ కార్మిక అధికారి సారామార్గరేట్ సూచించారు. పట్టణంలోని లేబర్ కార్యాలయంలో బుధవారం బైక్‌మెకానిక్ షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాల కన్నా తక్కువగా ఉన్న పిల్లలను పనిలో పెట్టుకోవద్దన్నారు. అలా చేస్తే చట్టరిత్యా నేరం అని, చట్టాన్ని అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దుకాణాల్లో బాలలను పనిచేయించుకుంటే యజమానులపై రూ.50,000 జరిమానా, రెండు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తామని చెప్పారు.

వలంటీర్లు అప్రమత్తంగా ఉండాలి

మహానంది: ప్రభుత్వ పథకాలకు సంబంధించి వలంటీర్లకు వచ్చే అపరిచిత కాల్స్ పట్ల మోసపోవద్దని మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విజయవాడ, తదితర నగరాల నుంచి కొందరు సైబర్ నేరగాళ్లు వలంటీర్లకు ఫోన్ చేసి పథకాలు పడని లబ్దిదారుల వివరాలు కావాలంటూ కాన్ఫరెన్స్ కాల్స్ రూపంలో మోసం చేస్తున్నారన్నారు. దీంతో లబ్దిదారుల వివరాలు తెలుసుకొని వారికి ఫోన్లు చేయడం, ఓటీపీ వస్తుందని చెప్పి బ్యాంకుల్లోని డబ్బులు కాజేస్తున్నారని తెలిపారు. ఇలాంటి కాల్స్ పట్ల వలంటీర్లు, సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. తాజాగా బుధవారం గాజులపల్లెకు చెందిన ఓ లబ్దిదారుడికి అపరిచితుడు కాల్ చేసి అకౌంట్స్ నుంచి కొంత సొమ్ము డ్రా చేసినట్లు సమాచారం.

వడ్లరామాపురంలో 'పల్లె నిద్ర'



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: మండలంలోని వడ్లరామాపురం గ్రామంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు , కార్యకర్తలు పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, జేసీఎస్ అధ్యక్షులు లక్ష్మీరెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ బాలస్వామియాదవ్, శేషిరెడ్డి, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మమ్మ తదితరులు ప్రతి ఇంటికీ వెళ్లి ముఖ్యమంత్రి అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాజారెడ్డి, రవినాయక్, సుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, శివరాం తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



బైరెడ్డినగర్ జెడ్పీ హైస్కూల్‌లో బాలికను చేర్చుకుంటున్న హెచ్‌ఎం సలీంబాషా

నందికొట్కూరు: బడి ఈడు పిల్లలను బడికి పంపితే రాష్ట్ర ప్రభుత్వమే పైసా ఖర్చు లేకుండా చదివిస్తుందని జడ్పీ హైస్కూల్ హెచ్ఎం సలీంబాషా అన్నారు. బుధవారం పట్టణంలోని జెడ్పీ హైస్కూల్(కోట), ప్రాథమిక పాఠశాలల పరిధిలో బడికి రాని విద్యార్థుల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వారి ఇళ్లకు వెళ్లి పిల్లలు బడికి వచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఫలితంగా 8వ తరగతి చదువుతున్న షేక్ రహమత్, 9వ తరగతి చదువుతున్న తుమ్మల రూప తల్లిదండ్రులకు నచ్చజెప్పి బడిలో చేర్పించుకున్నారు. ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్, సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ మహమ్మద్ షరీఫ్, వలంటీర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి

పాములపాడు: బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని వేంపెంట గ్రామంలో జీఈఆర్ సర్వేలో భాగంగా జెడ్పీహెచ్ స్కూలు నుంచి విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటరులో మా నవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, వెంకటేశ్వర్ రెడ్డి, నీలకంఠేశ్వరరెడ్డి, రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: బడి ఈడు పిల్లలంతా పనిలో కాకుండా బడిలో ఉండాలని శ్రీశైలం ప్రాజెక్ట్‌లోని శ్రీశైల మాత ఇంగ్లిష్ మీడియం అప్పర్‌ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. హెడ్‌మిస్ట్రెస్ డైసీ సింథియా రాణి, పీఈటీ కుమార్, రజియా తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి రూ.59.34 లక్షల ఆదాయం



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

మహానంది: మహానందీశ్వరుడికి హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ. 59.34 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. కామేశ్వరి దేవి, మహానందీశ్వర, కోదండ రామాలయాల్లోని హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం అభిషేక మండపంలో లెక్కించగా రూ.58,35,572 వచ్చిందన్నారు. వీటితో పాటు అన్నదాన విభాగం ద్వారా రూ.69,050, గోసంరక్షణ విభాగం ద్వారారూ.29,501 కలిసి మొత్తం రూ.59,34,123 వచ్చిందని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జునరావు, ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శివసప్తాహ భజనలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం దేవస్థానం కార్తీకమాసమంతా నిర్వహించిన శివచతుస్సప్తాహ భజనలు బుధవారంతో ముగిశాయి. కార్తీక శుద్ధపాడ్యమి రోజున ప్రారంభంకాగా కార్తీక మాసమంతా నిరంతరాయంగా అఖండ శివపంచాక్షరీ నామభజలనలు చేశారు. పూజా కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్‌రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ డి.పెద్దిరాజు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలోని గ్రామసచివాలయం - 2 నందు రెవెన్యూ అధికారులు గ్రామ ప్రజలకు ఈవీఎంల పనితీరు, ఓటు వినియోగంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్‌ఓ వి.బాల లక్ష్మయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.